మహిళా కార్మికులకు 'ప్రత్యేక' సెలవులివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఎస్వీ గోశాలలో అగరబత్తీల తయారీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు మూడు రోజులు తప్పనిసరిగా ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి అన్నారు. తిరుమల తిరుపతి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో ఉన్నటువంటి అగరబత్తీ తయారీ కేంద్రం దర్శన్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోంది. దర్శన్ సంస్థ మేనేజర్ రమణారెడ్డి గత కొన్ని రోజులుగా మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నాడని కొంతమంది మహిళలు మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై గజ్జల లక్ష్మి స్పందిస్తూ టిటిడి ఛైర్మన్‌ను తాడేపల్లిలోని నివాసంలో బుధవారం కలిసారు. మహిళలకు నెలసరి సమయంలో తప్పనిసరిగా మూడు రోజులు సెలవులు మంజూరు చేయాలని, సిసి కెమెరాలు విధిగా ఉండాలని, 80 మంది మహిళలు పనిచేసే చోట ఖచ్చితంగా మహిళా ఇన్‌ఛార్జిని నియమించాలని, ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ దర్శన్ సంస్థ మేనేజర్ రమణారెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంఎల్‌సి ఓట్ల నమోదులో...

భారీ అవకతవకలు

10రకాలుగా తప్పులు జరిగినట్లు గుర్తింపు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

తూర్పు రాయలసీమకు సంబంధించిన ఎంఎల్‌సి ఓటర్ల నమోదు కార్యక్రమంలో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పది రకాల పద్ధతుల్లో అధికార పార్టీ నాయకులు దొంగోట్లు నమోదు చేసినట్లు ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. వాటన్నింటినీ సమగ్రంగా విచారించి మేలైన ఓటర్ల జాబితా తయారు చేయాలని వారు డిమాండు చేస్తున్నారు.

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గాలకు సంబంధించి ఓటర్ల నమోదు వ్యవహారం రసాబాసగా మారిన విషయం తెలిసిందే. చరిత్రలో ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఈ సారి ఈ నియోజక వర్గంలో 4.10 లక్షల మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. 2017 ఎన్నికలతో పోల్చితే 1.77 లక్షల ఓట్లు అదనంగా నమోదయ్యాయి. ఇక ఇందులో తుది జాబితా నమోదయ్యే సరికి ఈ సంఖ్య 5 లక్షలు దాటినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని తెలుస్తోంది. ఇలా నమోదు కావడంపై ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యంగా ఇంత పెద్ద ఎత్తున ఓటర్ల సంఖ్య పెరగడానికి ఏ నియమ నిబంధనలు పాటించకుండా వాలంటీర్లు రంగంలోకి దిగి అర్హత ఉన్న లేకున్నా దరఖాస్తులు సేకరించి సమర్పించారు. వివిధ రకాల సర్టిఫికేట్లను ఇష్టం వచ్చినట్లు జతపరిచి ఆన్‌లైన్‌లో నమోదు చేశారనే విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు గుట్టలు గుట్టలుగా తెచ్చినా అధికారులు వీటిని స్వీకరించారు. ఒకే రోజు లక్షలకు పైగా దరకాస్తులు సమర్పించారు. ఇవన్నీ హడావుడిగా అక్రమ ఆధారాలతో సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని ప్రత్యేకంగా పరిశీలించాక మాత్రమే అంగీకరించాలి. అధికారులు బల్క్‌గా తీసుకున్న వాటిలో వెరిఫికేషన్ ఉండటం లేదు. డిగ్రీ సర్టిఫికేట్‌లకు అటస్టేషన్ లేకుండానే సమర్పించారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్టిఫికేట్లలో పేరు, ఫోటో, మంజూరు చేసిన తేదీలను కూడా మార్చేసి ఇచ్చారని వార్తలొస్తున్నాయి.

గుర్తింపులేని విశ్వవిద్యాలయాల సర్టిఫికేట్లు కూడా జత పరిచారు. ఒక్కరే రెండేసి చోట్ల నమోదయ్యారనే విమర్శలున్నాయి. కొన్నింటిల్లో అడ్రస్సులు కూడా లేకుండా నమోదు చేశారు. మండలస్థాయి అధికారులను ఒప్పించి ఏ పరిశీలనా లేకుండా ధృవీకరింపజేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఏ సర్టిఫికేట్ లేకపోయినా నమోదు చేయించుకున్నారు. బిఎల్‌ఓలు ఇంటికెళ్లి చెక్‌లిస్టు ప్రకారం పరిశీలించకుండా అంగీకరించేశారనే విమర్శలున్నాయి. ఇదే విధంగానే ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఓటర్లు కూడా నమోదయ్యారు. ఒకే రాత్రికి 8వేల మందికి పైగా నమోదు కావడంపైనా ఆరోపణలున్నాయి.

బిజెపిని ఒంటరి పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఒంటరి పాటు చేయాలని, అన్ని రకాల శక్తులు ఐక్యతను బలపరిచే విధంగా సిపిఎం కషి చేస్తుందని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో విశాఖకు విచ్చేసిన సందర్భంగా ప్రధానమంత్రి రాష్ట్రానికి సంబంధించిన ఒక్క సమస్యనూ ప్రస్తావించలేదన్నారు. అలాగే ముఖ్యమంత్రి ఉపన్యాసంలో కొన్ని అంశాలను ప్రస్తావించినా వాటిపైనా స్పందించలేదన్నారు. మోడీ యాత్ర సందర్భంగా రైల్వేజోన్ ప్రారంభిస్తారని బిజెపి, వైసిపి నాయకులు ఆశలు కల్పించారన్నారు. తీరా ప్రధాని పర్యటనలో అటువంటి ఊసే లేదన్నారు. బిజెపి మోసకారితనం మరోసారి బట్ట బయటయ్యిందన్నారు. టిడిపి, జనసేన సైతం వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు, అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయన్నారు. రానున్న శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఓట్ల నమోదులో వైసిపి ప్రభుత్వ యంత్రాంగం అక్రమాలకు పాల్పడుతోందన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికార పార్టీ నిర్బంధాని సాగిస్తోందన్నారు. బలవంతపు భూసేకరణ పేరుతో రైతుల నుంచి భూములు తీసుకున్న వారికి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. సిపిఎం పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

25న బార్ అసోసియేషన్ ఎన్నికలు

చిత్తూరుఅర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనునట్లు ఎన్నికల అధికారి ఎం.ఎస్. యోగానంద్ తెలిపారు. బుధవారం చిత్తూరు బార్ అసోసియేషన్ వద్ద ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించారు. అధ్యక్ష పదవికి డి రాజేందర్ రెడ్డి, పి రమేష్, ఉపాధ్యక్ష పదవికి ఎం ఆనంద్, జి.ఆర్. గిరిధరన్, ఎం.రాజేశ్వరి, యు.విశ్వనాధ్ పోటీ పడుతున్నారు. కార్యదర్శి పదవికి అశోక ఆనంద్, జానకిరామిరెడ్డి, లోకనాథం, సత్యమూర్తి, కోశాధికారి పదవికి దేవేంద్రనాథ్, వెంకటపతి నాయుడు, స్పోర్ట్స్ సెక్రటరీ పదవికి లక్ష్మీకాంత్, సుబ్రహ్మణ్యం పోటీ చేస్తున్నారు. లైబ్రరియన్ పదవికి షఫీరుల, వరదరాజులు, ఈసీ మెంబర్ (జూనియర్) పదవులకు బ్రహ్మయ్య, దయాకర్, హరి ప్రసాద్, శివయ్య, వెంకటరమణ, వెంకటేశన్ బరిలో ఉన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ వార్డు పర్యటన

బట్టల దుకాణంలో పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, నగర కమిషనర్

చిత్తూరుఅర్బన్: నగర కమిషనర్ డా. జె అరుణ, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) వై. మేఘ స్వరూప్‌లు బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ పరిధిలో 39, 42 వార్డుల్లో పర్యటించారు. హై రోడ్డులో ఓ బహుళ అంతస్తుల భవనానికి సంబంధించి ఆస్తి పన్ను మదింపు విషయాలను కమిషనర్ డా. జె అరుణ అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను మదింపు, కొలతలు నిర్వహణ, క్లాప్ యూజర్ చార్జీల వసూలు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ అంశాలను సంబంధిత వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం 42 వార్డు పరిధిలో సుందరయ్యర్ వీధిలోని బహుళ అంతస్థుల భవనాన్ని తనిఖీ చేశారు.

క్షయ, హెచ్ఐవి, లెప్రసీ ఇన్‌ఛార్జిగా రవిరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లా క్షయ, హెచ్ఐవి, లెప్రసీ విభాగాల ఇన్‌చార్జిగా డాక్టర్ రవిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా క్షయ, హెచ్ఐవి, లెప్రసీ విభాగాల అధికారులు జిల్లా విభజన అనంతరం ఇతర జిల్లాలకు బదిలీ కావడం, దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ రవిరాజుకు అప్పగించినట్లు సమాచారం.

నూతన వంగడాల రూపకల్పనలో ముఖ్యపాత్ర

కేంద్ర జలశక్తి మంత్రికి గౌరవ డాక్టరేట్



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, క్యాంపస్

సాంకేతికంగా నూతన వంగడాలను రూపొందించడం, దేశ ఆహార భద్రతను సాధించడంలో వ్యవసాయ రంగానిది ముఖ్యపాత్రని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు గౌరవ డాక్టరేట్‌ను మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కేంద్ర మంత్రి ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం తన జీవితంలో మరచిపోని రోజుగా మిగిలిపోతుందన్నారు. దేశంలో 74 వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో ఆచార్య ఎన్జీ రంగ విశ్వ విద్యాలయం 11వ స్థానంలో ఉందన్నారు. శాస్త్రవేత్తల కృషి ఫలితంగా మన దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సంవృద్ధిని సాధించడమే గాక ఆహార ధాన్యాల వివిధ పంటల ఉత్పత్తులను ఎగుమతి స్తున్నామన్నారు. ప్రపంచ దేశాల్లో ఆహార ఉత్పత్తుల కొరకు మన దేశం వూపు చూసేలా చేయడం గర్వించదగిన విషయమన్నారు. మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఆచార్య ఎన్జీ రంగ విశ్వ విద్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. బి.పి.టి- 5204(సాంబా మసూరి), ఎం.టి.యు 7029(స్వర్ణ), ఎం.టి.యు 1001(విజేత) వంటి రకాలు దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయనీ, దేశంలోనే మొదటి సారిగా వ్యవసాయ రంగంలో డ్రోన్ ల వినియోగం వంటి నూతన విధానాలను ప్రవేశ పెట్టి అనేక విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వై.ఎస్.ఆర్ రైతు భరోసా కేంద్రాలను గ్రామ స్థాయిలో రైతులకు సేవలను అందించేలా తీసుకొచ్చామన్నారు. రాష్ట్రం లో మొత్తం 10,778 రైతు భరోసా కేంద్రాలకు వ్యవసాయ విశ్వ విద్యాలయం సాంకేతిక సహకారం అందించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలవుతున్న వ్యవసాయ కార్యక్రమాలు అన్నదాతకు తోడ్పతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, రెడ్డెప్ప, మిథున్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వైస్ ఛాన్సలర్ విష్ణు వర్ధన్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పద్మనాభ రెడ్డి, ఆచార్య ఎన్.జి రంగ విశ్వ విద్యాలయం బోర్డు మెంబర్స్ పి.వి.ఆర్ రెడ్డి, టి.వి మురళీ నాథ్ రెడ్డి, ఆచార్య ఎన్.జి రంగ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ జి.రామారావు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంలో సల్మాకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర పరిశోధక విద్యార్థిని సి.సల్మాకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి ఎం. దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విభాగ ఆచార్యులు డాక్టర్ బి. హేమలత రుద్రమదేవి పర్యవేక్షణలో " స్టడీస్ ఆన్ స్ట్రక్చరల్ అండ్ ల్యూమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ ట్రైవలెంట్ రేర్ ఎర్త్ అయాన్స్ ఎస్ఎమ్ 3ం, ఇయు3ం, డివై 3ం, హెచ్ఒ3ం, డోపేడ్ పివిఎ/పివిపి బ్లెండ్ పాలిమర్ ఫిల్మ్స్" అనే అంశంపై పరిశోధన సమర్పించినట్లు వెల్లడించారు.

విద్యుత్ కాంట్రాక్టు

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రధాన కార్యదర్శి బాలకాశి డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని, సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలకాశి వెల్లడించారు. సిఎం హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ ఐటి అర్హత కలిగిన ఆపరేటర్లందరికీ షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ పొందిన వారికి వాచ్‌మెన్ వేతనాలనే అందిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల ఇంక్రిమెంట్, సర్వీసు ఇంక్రిమెంట్ అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి టి. కుమార్ గుణశేఖర్, రవి, నాగార్జున, చంగల్రాయులు, భార్గవ్, దేవరాజులు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రుతం చేయాలి

చిత్తూరు అర్బన్ : భూతగాదాలు, సైబర్ నేరాలపై ప్రజలను అవగాహనా సదస్సుల ద్వారా జాగ్రుతం చేయాలని డిఎస్‌పి శ్రీనివాసమూర్తి అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఐరాల, కల్లూరు స్టేషన్లకు విచ్చేసిన ఆయనకు మహిళా పోలీసులు పూలగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మహిళా పోలీసులకు ఉద్యోగ బాధ్యతను వివరించారు. భూతగాదాలు, సైబర్ నేరాలపై అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సిఐ ఆశీర్వాదం పాల్గొన్నారు.

అలరించిన మ్యాజిక్ షో

చిత్తూరు అర్బన్: స్థానిక పీ ఈ ఎస్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మ్యాజిక్ షో నిర్వహించి విద్యార్థులందరినీ అబ్బుర పరిచారు. సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకొని శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకుంటే సమాజంలో మూఢనమ్మకాలను రూపుమాపవచ్చని, చూసేదంతా నిజం కాదని, ఇంద్రజాలంతో ఏది సాధ్యం కాదని, నోట్లో నుండి శివలింగాలు, చేతుల నుండి విభూది తీయడం ఇవన్నీ బూటకమేనని జన విజ్ఞాన వేదిక సైన్స్ ఇంద్రజాలికుడు యుగంధర్ తెలిపారు. అద్భుతమైన ప్రదర్శనల ద్వారా శాస్త్రీయమైన వివరణలు ఇస్తూ విద్యార్థుల్లో గొప్ప ఆలోచనలు రేకెత్తించారు. ఈ కార్యక్రమంలో పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి .కష్ణ బాబు, జన విజ్ఞాన వేదిక కార్యదర్శులు అరుణ్ శివప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేపట్టిన మహా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకరయ్య కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా అన్నమయ్య నడయాడిన కాలిబాటను అభివృద్ధి చెయ్యాలని కోరుతూ పాదయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ 20వ మహా పాదయాత్ర 18న మొదలై 21వ తేదీ ఉదయం తిరుమలకు అన్నమయ్య కాలిబాట ద్వారా చేరుకుంటారన్నారు. దాదాపుగా 10 నుంచి 15 వేల మందితో సాగే పాదయాత్రలో భజనలతో తిరుమల చేరుకుంటామన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి అనంత పద్మనాభరెడ్డి, లక్ష్మణ్ కుమార్, మణి, డి.శివమణి పాల్గొన్నారు.

ఆ అమానుష ఘటనకు ఏడేళ్లు

-నేడు కఠారి దంపతుల వర్ధంతి - జంట హత్యల కేసులో కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మున్సిపల్ నగర పాలక సంస్థ కార్యాలయం సాక్షిగా అప్పటి మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ హత్య జరిగి గురువారంతో ఏడేళ్ళు గడుస్తోంది. మేయర్ దంపతుల జంట హత్య జరిగి ఏడేళ్లు గడచినా నేటికీ చిత్తూరు వాసుల మదిలో మెదులుతూనే ఉంది. చిత్తూరు రాజకీయాల్లో ఓ నేత ఏకచత్రాధిపత్యాన్ని దెబ్బతీసి కఠారి కుటుంబం రాజకీయంగా తనదైన ముద్దవేసి తెలుగుదేశం పార్టీనుంచీ పోటీ చేసి 37 కార్పోరేట్లను కైవసం చేసుకొని మేయర్ స్థానాన్ని 33వ డివిజన్ నుండీ పోటీ చేసిన కఠారి అనురాధ చేజిక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కఠారి మోహన్ తెలుగుదేశం విజయానికి శక్తివంచనలేకుండా కృషి చేశారు. వెనువెంటనే వచ్చిన అసెంబ్లి ఎన్నికల్లోనూ టిడిపి విజయం సాధించి మాజి ఎంపి ఆదికేశులు నాయుడు సతీమణి డికె సత్యప్రభ చిత్తూరు ఎంఎల్ఏగా విజయం సాధించారు. జడ్‌పి కైవశం చేసుకున్న టిడిపి చిత్తూరు రూరల్ నుండీ విజయం సాధించిన గీర్వాణి చంద్రప్రకాష్ జెడ్పి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. చిత్తూరు నగరంలోని ముగ్గురు మహిళా మణులు ప్రజాప్రతినిధులుగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో తమదైన ముద్రవేశారు.

ఒకప్పుడు చిత్తూరు అంటేనే రౌడీలు, దౌర్జన్యాలు, హత్య రాజకీయాలకు నెలువుగా ఉండేది. అలాంటి చిత్తూరులో ముగ్గురు మహిళలు ప్రజా ప్రతినిధులు కావడంతో హత్య రాజకీయాలు, రౌడీమూకల ఆగడాలు తగ్గి ప్రశాంతంగా ఉందనుకుంటున్న నేపథ్యంలో ఒక్క సారిగా మేయర్ దంపతుల జంట హత్యలతో చిత్తూరులో అలజడి మొదలైంది. ఏడేళ్ల క్రితం నవంబర్ 17వ తేది చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోనే తుపాకులు, ఇనుపరాడ్లు, కత్తులతో దాడి అత్యంత కిరాతకంగా మేయర్ దంపతుల జంట హత్య సంఘటన జరిగింది. పోలీస్‌శాఖ ఒక్క సారిగా ఉలిక్కి పడ్డ సంఘటన అది. ఆసుపత్రికి తరలించేలోపే మేయర్ అనురాధ మరణించారు. తీవ్రంగా గాయపడ్డ మేయర్ భర్త కఠారి మోహన్ వెలూరు సిఎంసిలో చికిత్స పొందుతూ నవంబర్ 18వ తేది మరణించారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జంట హత్యలు జరిగిన నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి ఇంటిల్‌జెన్సీ వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కఠారి దంపతులు ఫైల్‌ఫోటో...

జైల్లో ప్రధాన నిందితుడు చింటూ

మేయర్ దంపతుల హత్య కేసులో పోలీసులు 11 మందిపై కేసునమోదు చేశారు. నేటికి ప్రధాన నిందితుడు కఠారి మోహన్ మేనల్లుడు చింటూ అలియాస్ చంద్రశేఖర్ నేటికీ చిత్తూరులో సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదిగా ఉన్నారు. ఈ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో 10 మందికి బైయిల్‌పై విడుదలై విచారణ ఎదుర్కొంటున్నారు. మేయర్ దంపుతుల హత్య కేసు పక్కా ప్రణాళికతో బురకా ధరించి మున్సిపల్ కార్యాలయంలోకి ప్రవేశించిన చింటూ, అనుచరులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు.

కేసు నీరుగార్చే యత్నం

కఠారి దంపతులు జంట హత్య కేసులో పోలీసులు, అధికార పార్టీ నీరుగార్చే ప్రయత్నం చేస్తోందంటూ కఠారి బందువులు, అభిమానులు, తెలుగుదేశం నాయకులు పోలీసులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా జంట హత్య కేసులో సాక్షులను విచారణ సందర్భంగా సంతపేటలో పోలీసులు హైడ్రామా నడిపి ఉద్దేశపూర్వకంగా పోలీసుల జీపులో గంజాయి తీసుకొచ్చి సాక్షుల పై అక్రమకేసులు పెట్టేందుకు ప్రయత్నం చేస్తే కఠారి అనురాధ కోడలు మాజీ మేయర్ కఠారి హేమలత తెలుగుదేశం నేతలు అడ్డుకున్నారు. ఈ ఘటనలో మాజీ మేయర్ కఠారి హేమలత రెండు కాళ్లపై పోలీసు జీపు ఎక్కడంతో దాదాపు 20 రోజులు ఆమె మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. జంట హత్యల కేసులో నిందితులకు శిక్షపడాలన కఠారి కుటుంబ సభ్యులతో పాటు కఠారి అభిమానులు, తెలుగుదేశం నేతలు కోరుతున్నారు.

నేడు కఠారి దంపతుల ఏడో వర్ధంతి

నేడు కఠారి దంపతుల ఏడో వర్ధంతిని పురస్కరించుకొని కఠారి హేమలత నేతృత్వంలో గంగనపల్లిలోని కఠారి దంపతుల సమాధి వద్ద నివాళ్ళు అర్పించడంతో పాటు చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్ధంతిని పురస్కరించుకొని నివాళ్ళు అర్పించేందుకు కఠారి కుటుంబ సభ్యులు, అభిమానులు, తెలుగుదేశం నాయకులు ఏర్పాట్లు చేశారు.

రాయలసీమ అభివృద్ధికి ఐక్య ఉద్యమం

- సదస్సులో సిపిఎం పిలుపు
- పది అంశాలపై తీర్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అత్యంత వెనుకబడిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాయలసీమ సదస్సులో తీర్మానించారు. 'రాయలసీమ సమగ్రాభివృద్ధి-ఆటంకాలు' అన్న అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని గుంతకల్లు పట్టణంలో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సు బుధవారం ముగిసింది. అనంతరం సదస్సులో చర్చించిన అంశాలు, తీర్మానాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల సదస్సుల్లో రాయలసీమ వెనుకబాటుతనం, సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పది అంశాలపై తీర్మానాలు చేశారు. తీర్మానాల వివరాలు ఈ విధంగానున్నాయి.

- రాయలసీమ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలకోట్లు కేటాయించాలి. మూడు సంవత్సరాల్లో ఈ నిధులు ఖర్చు పెట్టాలి.
- రాయలసీమలోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాలలో పూర్తిచేయాలి. ఈ ప్రాంత సాగుభూమికి సంవత్సరానికి ఒక పంటకైనా నీరివ్వాలి.
- రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 సంవత్సరాలు పన్ను రాయితీ కల్పించాలి.
- కడప జిల్లాలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి.
- అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్ సంస్థలు పూర్తి చేయాలి. కర్నూలులో రూ.400 కోట్లతో ట్రిపుల్‌ఐటి, రైల్వేకోచ్ నిర్మాణ పరిశ్రమ స్థాపించాలి. తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్ హామీ అమలు చేయాలి.
- వృత్తిదారులకు రక్షణ కల్పించాలి. చేనేతలో 11 రకాల రిజర్వేషన్లు అమలుచేయాలి. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ పటిష్టంగా అమలు జరపాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ఈ తరగతుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలి
- హంద్రీనీవాకు 80 టిఎంసిలు నీరు కేటాయించాలి. పిల్ల కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరివ్వాలి.
- రాయలసీమలో మైనింగు ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మైనింగు ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రాయలసీమ ప్రాంతాభివృద్ధికి కేటాయించాలి
- గత ప్రభుత్వ శాసనసభలో రాయలసీమకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతోపాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి.
- కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పజెప్పే విధానాన్ని ఆపాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మిగులు భూమిని పేదలకు పంచాలి.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

అంగన్‌వాడీలు.. సంపూర్ణ పోషక కేంద్రాలు

ప్రజాశక్తి-పుంగనూరు: అంగన్‌వాడీలు సంపూర్ణ పోషక కేంద్రాలని.. గతంలో కంటే భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాలలో సంపూర్ణ పోషక కేంద్రాలుగా తీర్చిదిద్దారని.. 25వ వార్డు కౌన్సిలర్ పూల త్యాగరాజు అన్నారు. బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలు మేరకు కోనేటిపాళ్యంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ కిట్లు, సంపూర్ణ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గంగులమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది సునంద, ఎంఎస్‌కే పూజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యా విధానాన్ని దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. కరోనా మహమ్మారితో మతిచెందిన ఎస్టీయూ యూనియన్ నాయకుడు యువరాజు జ్ఞాపకార్థం ఆయన తండ్రి రంగయ్య అంగన్‌వాడీ విద్యార్థులకు సీడీపీవో పద్మసునందన ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులపై సేవాభావం కలిగి ఉండటం అభినందనీయమని కొనియాడారు. సేవాతత్వంతో ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం పోరాడిన యువరాజు కరోనా మహమ్మారితో మతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, వైసీపీ నాయకులు ధన్‌రాజ్, ఆకులు గోపి, గోవిందస్వామి, ఆశా కార్యకర్త హేమలత పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో లక్ష్మీప్రసన్నకు బంగారు పతకం

ప్రజాశక్తి-పలమనేరు: ఈనెల 4, 5, 6 తేదీలలో పూణెలో జరిగిన నేషనల్ అథ్లెటిక్ పోటీలలో పలమనేరు పట్టణంలోని అంగడి వీధిలో నివాసం ఉంటున్న లక్ష్మీపతిరెడ్డి, శశికళ దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న బంగారు పతకం సాధించింది. పలమనేరు సమీపంలోని కేటిలాపురం ఈమాన్యుయేల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీప్రసన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పూణే ప్రాంతాలలో నిర్వహించిన అథ్లెటిక్ స్పీడ్‌వాక్ పోటీలలో మూడు కిలోమీటర్ల దూరాన్ని 17 నిమిషాల 44 సెకండ్లలో పరిగెత్తి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో లక్ష్మీ ప్రసన్న ఒక్కటే ఎంపిక కావడం విశేషం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ప్రతిభ చూపానని లక్ష్మీ ప్రసన్న తెలిపింది. విద్యార్థినిని ఇమాన్యుయేల్ పాఠశాల ప్రిన్సిపల్ కత్రీన్ జాకోబ్, ట్రైనర్ జలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు.

వ్యక్తిగత విమర్శలు తగవు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: టీడీపీ మండలాధ్యక్షుడు లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వెదురుకుప్పంలో టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటరీ వాణిజ్య విభాగ కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు.. తెలుగుదేశం నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివద్ధి చెందిందని.. మన తెలుగు రాష్ట్రానికి ఓ గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదేనన్నారు. వెదురుకుప్పం వైసీపీ నాయకులు వ్యక్తిగతంగా విమర్శించడం తగదని.. తనపై ఏవైనా ఆరోపణలు ఉంటే సాక్ష్యాధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు చాణిక్య ప్రతాప్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షులు శివరాం యాదవ్, వెంకటాద్రినాయుడు, చిన్నమరెడ్డి, నరసింహారెడ్డి, గంగయ్య, మధు, గుణశేఖర్, దాసరి కమ్యూనిటీ జిల్లా కన్వీనర్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- సోమల: అన్నెమ్మగారిపల్లి పంచాయతీ వడ్డీ రామాపురం వద్ద నూతనంగా నిర్మించనున్న చెత్తతో సందప తయారీ కేంద్రానికి బుధవారం ఉపాధి హామీ ఏపీవో దినకర్, జేఈ రెడ్డప్ప, సర్పంచ్ వనజమ్మ స్థల పరిశీలన చేశారు. అనంతరం షెడ్ల నిర్మాణం కోసం కావాల్సిన నిధులపై చర్చించారు. త్వరలోనే నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాదాబేగం, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శి లలిత పాల్గొన్నారు.

శాంతిపురంలో పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-శాంతిపురం: చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ శాఖ అధికారులతో నాడు-నేడు పనులపై జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు సమీక్షించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని.. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలాజీనాయుడు, సర్పంచ్ సంగం, మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, బైరెడ్డిపల్లి జడ్పీటీసీ కేశవులు, నాయకులు రామచంద్ర, రంగనాథన్, ఎంపీటీసీ సాగర్ పలువురు అధికారులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

రేపు దళిత సమరభేరి సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-యాదమరి: తిరుపతిలో ఈనెల 24న జరిగే దళిత సమరభేరి సమావేశాన్ని విజయవంతం చేయడానికి 18న పూతలపట్టు నియోజకవర్గ సమావేశాన్ని టీడీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సెల్ పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షుడు కోదండయ్య, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి ఆగస్టు మునిరత్నం తెలిపారు. దళిత సమరభేరి సమావేశానికి భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పులిచెర్ల అభివృద్ధే అందరి బాధ్యత

ప్రజాశక్తి-పులిచెర్ల: పులిచెర్ల మండలాభివృద్ధే అందరి బాధ్యత కావాలని.. ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్నిశాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు కతజ్ఞతలు తెలిపారు. చికెన్ దుకాణాల్లో వేస్టేజీని ఎప్పటికప్పుడు తరలించేలా దుకాణాల యజమానులకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు ఇవ్వాలన్నారు. సిమెంటురోడ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి స్థాయిలో ఎంబుక్ రికార్డు చేసి త్వరగా బిల్లులు మంజూరయ్యేలా సంబంధిత ఏఈ చూడాలని తెలిపారు. వర్షాలతో జ్వరం, డెంగీ ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వేడినీళ్లను తాగాలని వైద్యాధికారిణి జానకీరావు తెలిపారు. ఏపీవో షౌకత్‌అలీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఏపీఎం చంద్రమోహన్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు బ్యాంకు లింకేజీ నిధులు, వైఎస్సార్ క్రాంతి పథం, సున్నా వడ్డీ, జగనన్న తోడు పథకాలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరి గోవర్ధన్, ఎంపీడీవో సుగుణమ్మ, ఎంఈవో సిద్ధరామయ్య, ఏపీవో షౌకత్‌అలీ, ఏపీఎం చంద్రమోహన్, ఏవో హరిప్రసాద్, డీఈ రాజేంద్ర, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

కార్వేటినగరంలో...

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులకు చదువులో పోటీతత్వం తప్పనిసరిగా ఉండాలని తెలుగు ఉపాధ్యాయులు జనార్దన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ తత్వం ఉన్నప్పుడే విద్యలో రాణిస్తారని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లోని గ్రంథాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శంకరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సోమల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయంలో బుధశారం పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని.. విలువైన సమాచారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని .. పుస్తకాలను చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలలో చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

కార్వేటినగరంలో...

ప్రజాశక్తి-యాదమరి: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయులు దామోదరచారి తెలిపారు. బుధవారం యాదమరి మండల కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుప్పయ్య, ఆసియాబేగం, లక్ష్మి, కోటేశ్వరి, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సోమల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమల గ్రంథాలయాధికారి రామకష్ణ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివరత్నమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-పలమనేరు: వికేంద్రీకరణకు మద్దతుగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం బుధవారం పలమనేరు జాతీయ రహదారి హోటల్ సరస్వతి కేఫ్ ఎదురుగా జరిగింది. సమావేశంలో పలమనేరు శాసన సభ్యులు ఎన్.వెంకటే గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మూడు రాజధానులు ఏర్పాటు చేయాలన్న సంకల్పానికి తిరుమల శ్రీవారి ఆశీర్వాదం తోడవ్వాలని కోరారు. మరోవైపు ఒక ప్రాంతం అభివద్ధిని మాత్రమే కోరుకునే వారి మనసులు మార్చాలన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, కలిసొచ్చే రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ మరోసారి ముక్కలయ్యేందుకు అవకాశం లేకుండా అన్ని ప్రాంతాల అభివద్ధి కోసం వికేంద్రీకరణ భావనను మరింత బలంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజధాని విషయంలో శివరామకష్ణన్ కమిటీ చెప్పిన విషయాలకు కట్టుబడి ఉంటానని శాసనసభలో ఆనాడు జగన్ చెప్పారన్నారు. ప్రభుత్వ భూమిలో రాజధాని నిర్మాణం సరైనదని ముఖ్యమంత్రి చెప్పారని వివరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తాము వ్యతిరేకమని జగన్ శాసనసభ సాక్షిగా చెప్పారన్నారు. కర్నూలును న్యాయ రాజధానిగా చేయడంతో మరింత ప్రగతి సాధించవచ్చని తెలిపారు. మూడు రాజధానులను అన్ని ప్రాంతాల ప్రజలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పవిత్ర, మురళీకష్ణ, మండల కన్వీనర్ బాలాజీనాయుడు, సర్పంచ్ సంగం మండలాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, బైరెడ్డిపల్లి జడ్పీటీసీ కేశవులు, నాయకులు రామచంద్ర, రంగనాథన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తక్షణమే డీఏ బకాయిలు విడుదల చేయాలి

ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కార్వేటినగరం : రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి 2022 జనవరి నుంచి బకాయిలు రెండు విడతల కరువు భత్యం(డీఏ) 6.37 శాతాన్ని తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంపత్ స్కూల్ ఆవరణలో ఎస్టీయూ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఓసారి డీఏ చెల్లించడం ఆనవాయితీగా వస్తుందని.. ప్రస్తుతం ఒకటో తేదీ జీతాలు చెల్లిస్తే చాలు అన్న పరిస్థితికి ప్రభుత్వం అలవాటు చేస్తోందని విమర్శించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరగొండ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ టీచర్ల బదిలీలు, పదోన్నతులపై స్పష్టత నివ్వకపోవడంలో టీచర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. పాఠశాలల విలీనం పేరుతో విద్యార్థులను పాఠశాలలకు పంపి టీచర్ల కు పదోన్నతుల ద్వారా భర్తీ చేయకపోవడంతో విలీనమైన విద్యార్థులకు బోధన కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షులు నాగేంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నగరి డివిజనల్ కన్వీనర్ యువరాజు, జిల్లా నాయకులు చంద్రశేఖర్, అక్కారిబాబు న్యామతుల్లా , వెంకటేశులు, బంగారమ్మ, సర్దార్ , మండల నాయకులు కార్తికేయులు మోహన, మురళీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గాజుల నాగేశ్వరరావు

గ్రామాల్లో పేదలకు నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి-యాదమరి: యాదమరి మండలంలోని మోర్దానపల్లి పంచాయతీలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ మీనా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు గ్రామాల్లోనే అందించే విధంగా కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతిఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రోగులకు 67 రకాల మందులను ఉచితంగా అందిస్తామని.. నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సురేంద్రరెడ్డి, సాయిపల్లవి, ఆశ కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సోమల: పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆవుల పల్లె ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. వైద్యాధికారిణి సోనియా విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలువురికి వైద్య సేవలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పీ ఆదిలక్ష్మి, సూపర్వైజర్ చంద్రమ్మ, ఏఎన్ఎం మాధవి, పాఠశాల, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద బుధవారం జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యం లో 110 మందికి ఎకో,ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఏడుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని కోలార్ ఆర్.ఎల్.జాలప్ప మెడికల్ కాలేజ్‌లోని నారాయణ హదయాలయ హార్ట్ సెంటర్‌కు రెఫర్ చేశారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించనున్నారు. డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ నేడు మానవ సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య మానసిక ఒత్తిడేనని తెలిపారు.

కేవీపీఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి – బైరెడ్డిపల్లి: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అన్నూరి ఈశ్వర్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లి మండలం కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జి.రఘు, టి.శంకరయ్య, ఉపాధ్యక్షులుగా వై లక్ష్మయ్య, కె.ఎం. వెంకటేశు, సహాయ కార్యదర్శులుగా వి.వీరభద్ర, కేఎం నారాయణప్ప, కోశాధికారి పి.జయచంద్ర, కార్యవర్గ సభ్యులుగా కె.తిప్పయ్య, కె.బాబు, వై .సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప ,కష్ణప్ప, రమేష్, బాలకష్ణ, శివ, రామచంద్రయ్య రమణయ్య, మునస్వామి, చౌడప్ప ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలో నివాస ముంటున్న హరినాథ్ (54) అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇంట్లోనే ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమ కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పుంగనూరు: కర్ణాటక నుంచి అక్రమంగా మధ్యాన్ని తరలిస్తుండగా ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్‌పేట గంగమ్మ గుడి వీధికి చెందిన షేక్‌సయ్యద్‌బాషాను అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతనితోపాటు అబ్రార్ అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. వీరిద్దరూ కలసి రెండు ద్విచక్ర వాహనాల్లో 288 టెట్రా ప్యాకెట్లు, ఒరిజినల్ ఛాయిస్ విస్కీ 90, కర్ణాటక రాష్ట్రం నుంచి పుంగనూరు తీసుకొచ్చి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సయ్యద్‌బాషాను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. దాడుల్లో ఎస్సై అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

20న సీనియర్ జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఈనెల 20వ తేదీన బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ స్త్రీ, పురుషులు జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు తులసిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 8 నుంచి 11 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే అంతర్ జిల్లాల సీనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనాలని.. వివరాలకు 9441392407, 7416162744 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని.. డాక్టర్ వైఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రావు సూచించారు. బుధవారం కళాశాలలో స్పోర్ట్స్ ఆక్టివిటీస్ కార్యక్రమాన్ని నిర్వ:హించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు లక్ష్మీ ప్రసన్నలత మాట్లాడుతూ కళాశాలలో విద్యతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా॥ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా॥ మంగళ గౌరీ , అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్లూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-పులిచెర్ల: కల్లూరు పోలీస్టేషన్‌ను బుధవారం చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా త్వరితగతిన కేసులను పూర్తి చేయాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిశీలించి అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యకలాపాలు, కోడి పందేలు, పేకాట ఆడినా, గుట్కా, పాన్, గంజాయి అమ్మినా వెంటనే 100కి ఫోన్ చేయాలని, లేనిపక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కల్లూరులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన సదస్సులు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఆశీర్వాదం, ఎస్సై రవిప్రకాష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో వంటకాల ప్రదర్శన

ప్రజాశక్తి-సోమల: వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఈసీ సమావేశం సందర్భంగా చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ పూర్వకాలంలో చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తినడంతో పూర్వీకులు ఎంతో ఆరోగ్యంతో జీవించారని.. నేటి సమాజంలో జీవన సరళిలో మార్పుల కారణంగా అనేక వ్యాధులు పట్టి పీడిస్తున్నాయని తెలిపారు. చిరుధాన్యాలతో ఆరోగ్యం ఆనందదాయకంగా ఉంటుందన్నారు. బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఏపీఎం శివ, తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, శ్రీనిధి మేనేజర్ రమ్యసాయి, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులను పాటించి దిగుబడులతోపాటు ఆర్థికాభివద్ధి చెందాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ గోపాల్ సూచించారు. గంగాధనెల్లూరు మండలం చిన్న వేపంజేరి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు వివిధ రకాల వ్యవసాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న వేపంజేరి సర్పంచ్ ఝాన్సీ, హేమశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుసుమ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించారని.. అర్హులై ఉండి పథకాలు అందని వారు సచివాలయాల్లో సంప్రదించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని నల్లగాడు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లో గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందుతున్నాయా.. లేదా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచ్ ధనంజయ, తహసీల్దారు బెన్‌రాజ్, ఏఈలు గురవారెడ్డి, శ్రీధర్, కిషోర్‌కుమార్, గుణశేఖర్‌రెడ్డి, ఎంఈవో నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



ప్రజాశక్తి-కార్వేటినగరం: వ్యవసాయ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని సూపరింటెండెంట్ (ఎస్ఈ) కష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నూరు, కార్వేటనగరం సబ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. అనంతరం ఎస్.ఈ మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది రైతులకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న విద్యుత్ సమస్యలను విధిగా గుర్తించి పరిష్కరించేందుకు కషి చేయాలన్నారు. లూస్ లైన్లు, ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి తమ దష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు, కావాల్సిన వస్తువులను ఈనెల ఆఖరి లోపు అందించాలన్నారు. విద్యుత్ సమస్యలపై రైతులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఏడీఈ నాగరాజు, ఏఈలు రీయాజ్‌బాషా, గిరి, సిబ్బంది పాల్గొన్నారు.